# పథకాలు కొనసాగాలంటే.. సీఎం జగన్ రావాలి

## ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేదలకు మేలు జరగాలన్నా.. మరోసారి పెద్దెత్తున సంక్షేమ పథకాలు పేదలకు అందాలన్నా... అభివృద్ధి పనులన్నీ ముందుకు సాగాలన్నా.. మరోసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ఆయనకు మనమంతా అండగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో బుధవారం పలు డివిజన్లలో ఎమ్మెల్యే నాని పర్యటించారు. ముఖ్యకార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. టూటౌన్ పరిధిలోని 40వ డివిజన్‌లో కార్పొరేటర్, క్లస్టర్-3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను 90 శాతానికిపైగా అమలు చేసి చూపించారని వివరించారు. గతంలో చంద్రబాబు ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ఏవిధంగా ప్రజలను మోసం చేశారో ప్రతి ఒక్కరూ చూశారని గుర్తుచేశారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు తన పాలనలో సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలు గుర్తించాలని కోరారు. బాబు మోసపు మాటలు, హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దని హితవుపలికారు.

**పేదలను పట్టించుకోని చంద్రబాబు**

టీడీపీ హయాంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడు పేదలకు మంచి చేసిన దాఖలాలు లేవని ఎమ్మెల్యే నాని ఆరోపించారు. ఏలూరు వన్‌టౌన్‌లోని 18వ డివిజన్‌లో కార్పొరేటర్ ఇనపనూరి కేదారేశ్వరి, పార్టీ నాయకులు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో నాని మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం అనుభవజ్ఞుడని నమ్మి ప్రజలు అధికారమిస్తే మహిళలు, రైతులను, అన్ని వర్గాలకు ఎంత దారుణంగా మోసం చేశారో చూశామని గుర్తుచేశారు. ప్రజలు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని కోరారు.

**సైనికుల్లా పనిచేయాలి**

వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే నాని పార్టీ శ్రేణులను కోరారు. ఏలూరు టూటౌన్ ప్రాంతం ఆర్ఆర్‌పేట 37వ డివిజన్‌లో వెంకటేశ్వరస్వామి గుడి చైర్మన్, పార్టీ ఇన్‌చార్జి తోలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, అనంతరం ఏలూరు వన్‌టౌన్‌లోని 16వ డివిజన్‌లో కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, పార్టీ యువజన నాయకులు జిజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని స్థానికంగా మహిళలు, పార్టీ కార్యకర్తలతో మమేకం అవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏలూరు నియోజకవర్గంలో ఐదేళ్ల కాలంలో ఏ విధంగా అభివృద్ధి పనులు చేశామో ప్రజలకు వివరించాలన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతి హామీని నెరవేర్చారని వివరించారు. మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకొంటేనే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంల్లో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, పార్టీ క్లస్టర్-1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్, పార్టీ నాయకులు యుగంధర్‌ప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ వైఎస్‌వీ శివరావు, సేవాదళ్ అధ్యక్షులు యల్లాపు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.


40వ డివిజన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని


18వ డివిజన్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ కేదారేశ్వరి, చిత్రంలో ఎమ్మెల్యే నాని


37వ డివిజన్‌లో పార్టీ మహిళలతో ఎమ్మెల్యే నాని

## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ బీసీ సెల్ సెక్రటరీగా అన్నవరం


ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అన్నవరం

ఏలూరు రూరల్ : ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని ఏలూరు నగర వైఎస్సార్ సీపీ బీసీ సెల్ సెక్రటరీగా వై.అన్నవరం నియమించారు. బుధవారం అన్నవరం ఆళ్ల నానిని కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అన్నవరం వెంట కార్పొరేటర్ తంగెళ్ల రాము, నగర బీసీ సెల్ అధ్యక్షులు లక్కోజి గోపీ, పార్టీ 15 డివిజన్ ప్రసిడెంట్ అబ్బిరెడ్డి రంగముత్యాలు ఉన్నారు.

### కొనసాగుతున్న రామకోటి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి మహోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరే రామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నగరానికి చెందిన వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7 గంటలకు నెల్లూరుకు చెందిన పరాయితం నారాయణాచార్యులు భాగవతార్ పార్వతి కళ్యాణం అనే అంశంపై నిర్వహించిన హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పవర్‌పేట ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగింపు, వార్షిక మరమ్మతుల నిమిత్తం గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ సంస్థ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేవీబీ నటరాజన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వసంతమహల్ సెంటర్, పాత బస్టాండు సెంటర్, చిట్టివలస పాకలు, గూడ్స్‌షెడ్ రోడ్డు, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

# దివ్యాంగులకు ఉత్తమ సేవలు అందించాలి


ప్రత్యేక ఉపాధ్యాయులతో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మణి

ఏలూరు (టూటౌన్) : దివ్యాంగులకు ఉత్తమ సేవలు అందించాలని విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.రాకడ మణి అన్నారు. స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏడీ మణి మాట్లాడుతూ అన్ని ఉద్యోగాలకంటే ప్రత్యేక ఉపాధ్యాయ వృత్తిలో ఆత్మ సంతృప్తి ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం ప్రస్తుతం 21 రకాల వికలాంగత్వాలుగా ఉన్నాయని, వీటి అవగాహన కలిగి దివ్యాంగులకు సహాయ పడాలని సూచించారు. ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సీఆర్ఈ కోఆర్డినేటర్ డి.శ్రీనివారెడ్డి మట్లాడుతూ తమ సంస్థ గత 30 సంవత్సరాలుగా అనేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు. ఐఈఆర్‌టీ టీచర్లు అందరినీ తమ పరిధిలో ఉన్న దివ్యాంగులకు ఉత్త సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఎస్ఏ నాయుడు, టి.హరిబాబు, కె.ధర్మేందర్ రెడ్డి, ఎ.అర్మజి అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ-చలానాల విధింపును నిలిపివేయాలి

ఏలూరు (టూటౌన్): సీసీ కెమేరాల ద్వారా ఈ-చలానాలు విధించడాన్ని నిలిపివేయాలని ఆటో, క్యాబ్ వాహనాలపై విధించిన ఈ-చలానాలను రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు బుధవారం అడిషనల్ ఎస్పీ జి.స్వరూపరాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమలో యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపి, నాయకులు చక్రాల అమర్ కుమార్ పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో సైన్స్‌ది కీలక పాత్ర

ఏలూరు రూరల్ : శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం సాధిస్తున్న పురోభివృద్ధి నుంచి విద్యార్థులు స్ఫూర్తి పొందాలని మాదేపల్లి జెడ్పీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పువ్వులు ఆంజనేయులు సూచించారు. బుధవారం పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవానికి స్వదేశీ టెక్నాలజీ ఫర్ వికసిత్ భారత్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా సైంటిఫిక్ రీసెర్చ్‌ను ప్రోత్సహిస్తుందన్నారు. ప్రఖ్యాత భారతదేశ భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్‌తో పాటు నేటి శాస్త్రజ్ఞులు సాధించిన విజయాలను బాలబాలికలు తెలుసుకోవాలని సూచించారు. దేశం కోసం కొత్త అవిష్కరణలు చేయాలన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు వై.దుర్గ, ఎండీ యాస్మిన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేయగా, విద్యార్థులు పలు అంశాలు ప్రదర్శించారు.




మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో సైన్స్ డే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు , సైకిల్‌కు స్ప్రే మోటార్ అమర్చిన వసీమ్ (ఇన్‌సెట్‌లో)

**స్ప్రే మోటార్‌తో సైకిల్ రైడ్**

ఏలూరు రూరల్ : తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన వసీమ్ వినూత్న ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంది. తను రోజూ స్కూల్‌కు వెళ్లే సైకిల్ స్పీడ్ పెంచేందుకు చేలల్లో కలుపు మొక్కలపై రసాయనాల స్ప్రే చేసే 30 సీసీ మోటార్‌ను ఉపయోగించారు. మొదట స్ప్రే మోటార్ వీల్‌కు సైకిల్ బ్యాక్ వీల్ ఫ్రీవిల్‌ను చైన్‌తో అనుసంధానించారు. స్పీడ్ పెంచేందుకు హేండిల్ వద్ద ఎక్సలేటర్ ఏర్పాటు చేశారు. మోటార్ ట్యాంక్‌లో పెట్రోల్ పోసి సైకిల్‌ను మోటార్ సైకిల్ చేసి అబ్బురపరిచాడు. సైన్స్ డే సందర్భంగా బుధవారం శ్రీచైతన్య స్కూల్‌లో తన సైకిల్ ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నాడు.

# జగన్‌ను రెండోసారి గెలిపిద్దాం

ఏలూరు (టూటౌన్): రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత దళిత, బడుగు, బలహీన వర్గాలపై ఉందని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయనటువంటి సామాజిక న్యాయ సూత్రాన్ని జగన్ పాటించారని తెలిపారు. నవ యువ అంబేడ్కర్‌గా బహుజనుల పక్షాన బలంగా నిలబడ్డ ఏకైక నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. జనరల్ స్థానాల్లో సైతం బీసీ, ఎస్సీలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా నియమిస్తూ పెత్తందారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్ విజయం సాధించకపోతే బలహీన వర్గాల వారి భవిష్యత్తు అంధకారమవుతుందని వివరించారు. పేద విద్యార్థుల ఇంగ్లిషు మీడియం చదువులు అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసే విధంగా ఉండాలంటే మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గుర్రాల రవికుమార్ పిలుపు నిచ్చారు.

## భక్తి శ్రద్ధలతో తపస్సుకాల దీక్షలు


ప్రార్థన చేస్తున్న మాలధారులు

పెదవేగి : భక్తి శ్రద్ధల నడుమ తపస్సుకాల దీక్షలు నిర్వహిస్తున్నారు. మండలంలోని క్రైస్తవులు తపస్సుకాల దీక్ష చేపట్టారు. పెదవేగి మండలం వేగివాడ, విజయరాయి, న్యాయంపల్లి, దుగ్గిరాల, పినకడిమి కొప్పాక, గ్రామాల్లో ఖతోలిక సంఘం ఆధ్వర్యంలో వందలాదిమంది క్రైస్తవ భక్తు లు తపో దీక్ష స్వీకరించారు. బుధవారం ఉదయం వేకువజామునే భక్తులు కుటుంబ సమేతంగా బయలుదేరి దేవాలయాలకు వెళ్లి దైవ సేవకుల చేతలమీదుగా దీక్షను స్వీకరించిన మాలాధారులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా విజయరాయి విచారణ గురువు దివాకర్, నడిపల్లి విచారణ గురువు రాజు, వేగివాడ విచారణ ఫాదర్ పాస్కాలిలు ప్రసంగిస్తూ ప్రభువైన క్రీస్తు శిలువలో బలియాగమవ్వడానికి ముందు 40 రోజులపాటు 'సినాయ్' పర్వతంమీద ఉపవాస ప్రార్థ నలు చేసారు. దీనిని ఆధారంగా చేసుకుని క్రైస్తవ విశ్వాసులు ఏటా 40 రోజులపాటు ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నియమ నిష్టలతో నిర్వహిస్తారన్నారు.

**నడిపల్లిలో... :** నడిపల్లి విచారణలో ఉన్నటువంటి తొమ్మిది గ్రామాల సంఘస్తులు సంఘ విశ్వాసులు అందరు విబూది బుధవారం పురస్కరించుకుని విచారణ గురువులు రాజు ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులకు, దీక్షపరులకు జప మాల వేసి దీక్ష విధి విధానాలు తెలియజేశారు. 40 రోజులు భక్తి శ్రద్ధలతో దీక్ష పూర్తి చేయాలన్నారు.

## విద్యార్థులకు గడియారాల పంపిణీ


విద్యార్థులకు గోడ గడియారాలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ శైలజ దంపతులు

పెదపాడు: విద్యార్థులు చిన్ననాటి నుంచి తల్లిదండ్రులపై ప్రేమ పూర్వకంగా, గౌరవ భావంతో మెలగాలని మాజీ సర్పంచ్ మెడబలిమి శైలజ జాన్సన్ తెలిపారు. పెదపాడు మండలం పాత ముప్పర్రుకి చెందిన మెడబలిమి కాంతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు జాన్సన్ శైలజ దంపతులు శాల్వేషన్ ఆర్మీ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గోడ గడియారాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుంచి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. శాల్వేషన్ ఆర్మీ మేజర్ జే వీరయ్య, జే మేరీ క్యాథరీన్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగలింగేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ


ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న కొఠారు అబ్బయ్యచౌదరి, ప్రజాప్రతినిధులు

దెందులూరు: జోగన్నపాలెంలో బుధవారం యోగలింగేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో ధ్వజ, శిఖర, ఛండేశ్వర, కాలభైరవ, ద్వారపాలక, జంట నాగుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ బాదంపూడి ఫణిశర్మ ఆధ్వర్యంలో అర్చకులు రుద్రపాక చైతన్య శ్రీ సాయి దత్త శర్మ పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సొసైటీ చైర్మన్ పాకల పాటి శ్రీనివాసరావు, మాజీ సొసైటీ చైర్మన్ అలూరి గోవిందరావు, సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీతోపాటు అనేకమంది భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో మంత్రులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణ, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత బుధవారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తర్వాత ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు చినవెంకన్న జ్ఞాపికలను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు పెద్దిరెడ్డి పద్మజ్యోతి, మానుకొండ సుబ్బారావు, ఆచంట అనసూయ, తానంకి గంగరాజు, వాసే రామకృష్ణ, నూకల అమ్మాజీ, పాలా వెంకటేశ్వరరావు, తొమ్మండ్రు రమేష్, కొట్టు వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 33 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 40 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.30 | 41 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 16.00 | -- |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 36 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 22 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 04 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 21 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 28 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 21.00 | 4804 | 25 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 15 |
| ఏలూరు - విశాఖపట్నం | 12.00 | 4840 | 34 |

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 20 | అరటి కాయ (1) | 05-07 |
| వంకాయలు (గులాబీ) | 44 | చిక్కుడు కాయలు | 60 |
| వంకాయలు (కాంతులు) | 48 | చామదుంపలు | 60 |
| వంకాయలు (తెలుపు) | -- | ములక్కాడలు | 05, 07, 10 |
| బెండకాయలు | 32 | కంద | 64 |
| పచ్చిమిర్చి | 34 | బీట్‌రూట్ | 44 |
| కాకర కాయలు | 44-52 | కీరా దోస | 34 |
| బీరకాయలు | 28 | ఫ్రెంచ్‌బీన్స్ | 74 |
| కాలీఫ్లవర్ | 30 | అల్లం | 120 |
| క్యాబేజీ | 34 | కొత్తిమీర (కట్ట) | 18 |
| క్యారెట్ | 40-44 | పాలకూర | 10 |
| దొండకాయలు | 30 | చుక్కకూర | 10 |
| బంగాళదుంపలు | 26 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 24-28 | గోంగూర | 08 |
| గోరుచిక్కుడు | 36 | పుదీనా | 05 |
| దోసకాయలు | 30-34 | బఠాణి | -- |
| ఆనబకాయ (1) | 20-25 | క్యాప్సికమ్ | 70 |
| పొట్లకాయ(1) | 15-20 | చిలకదదుంప | 24 |